నేటి నుంచి ఇంటర్ విద్యార్థులకు మధ్యాహ్న భోజనం

ప్రజాశక్తి - పార్వతీపురం

ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు ఈనెల 4 నుంచి డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం అమలు జరుగుతుందని జిల్లా ఇంటర్మీడియట్ విద్యా అధికారి డి.మంజుల వీణ శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. రాష్ట్ర మహిళా శిశు సంక్షేమ శాఖ మరియు గిరిజన సంక్షేమ శాఖ మంత్రి శ్రీమతి గుమ్మిడి సంధ్యా రాణి శనివారం సాలూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఈ పథకాన్ని ప్రారంభిస్తారని తెలిపారు. జిల్లా కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ కూడా కార్యక్రమంలో పాల్గొంటారని ఆమె చెప్పారు. జిల్లాలోని 14 ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో చదువుతున్న 5,905 మంది విద్యార్థులు ప్రయోజనం పొందుతున్నారన్నారు.

త్వరలో పార్వతీపురంలో ఇన్నోవేషన్ హబ్

ప్రజాశక్తి - పార్వతీపురంటౌన్

నీతి ఆయోగ్ ప్రకటించిన ర్యాంకింగుల్లో ఆశావహ (ఆస్పిరేషనల్) జిల్లాగా పార్వతీపురం నిలిచినందున రూ.3 కోట్లు నిధులు విడుదలయ్యాయని, ఆ నిధులతో త్వరలో ఇక్కడ ఇన్నోవేషన్ హబ్‌ను నిర్మించుకోనున్నట్లు కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ తెలిపారు. ఈ హబ్‌లో ఫిజిక్స్, మ్యాథ్స్, ప్లానిటోరియం వంటివి రాబోతున్నాయని, తప్పకుండా విద్యార్థులకు ఎంతో ప్రయోజనకరంగా ఉంటుందని తెలిపారు. స్థానిక డివివిఎం స్కూల్ ఆవరణలో జిల్లా స్థాయి విద్యా, వైజ్ఞానిక శాస్త్ర ప్రదర్శన ముగింపు కార్యక్రమం విద్యాశాఖ ఆధ్వర్యంలో శుక్రవారం జరిగింది. ఈ కార్యక్రమానికి కలెక్టర్ ముఖ్యఅతిధిగా పాల్గొని, పాఠశాల విద్యార్థులు రూపొందించిన సృజనాత్మక విజ్ఞాన ప్రదర్శనలను ఆయన తిలకించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో విద్యా వ్యవస్థ చాలా బాగుందని, పదవ తరగతి ఉత్తీర్ణతలో గత రెండేళ్లుగా జిల్లా రాష్ట్రంలోనే తొలి స్థానంలో నిలిచిందని, ఈసారి కూడా ముందంజలో ఉండాలని కోరారు. తనకు ఫిజిక్స్ అంటే చాలా ఇష్టమని, ఉపాధ్యాయ వృత్తిలో కూడా తాను ఫిజిక్స్ బోధించినట్లు గుర్తుచేశారు. ప్రపంచంలో అన్నీ సైన్స్‌తోనే ముడిపడి ఉన్నాయని, ప్రశ్నించే తత్వంతోనే సైన్స్ మొదలవుతుందని గుర్తుచేశారు. ప్రతి విద్యార్థి ప్రశ్నించే తత్వాన్ని అలవాటుగా చేసుకోవాలని, సందేహాలను ఉపాధ్యాయులను అడిగి నివృత్తి చేసుకోవాలని చెప్పారు. సైన్స్, మ్యాథ్స్, ఫిజిక్స్, బయాలజీలపై పట్టు సాధించాలని, దీనివల్ల సృజనాత్మకత పెంపొందుతుందన్నారు. ప్రతి విద్యార్థి సృజనాత్మకంగా ఆలోచిస్తే తప్పకుండా శాస్త్రవేత్తలు కావచ్చని స్పష్టం చేశారు. అనంతరం మూడు విభాగాల్లో ప్రథమ, ద్వితీయ స్థానాలు కైవసం చేసుకున్న విద్యా వైజ్ఞానిక శాస్త్ర ప్రదర్శనల రూపకర్తలకు, క్విజ్ పోటీల్లో గెలుపొందిన విజేతలకు కలెక్టర్ జ్ఞాపిక, సర్టిఫికెట్లను బహూకరించారు. అలాగే

విద్యార్థులకు బహుమతులను అందజుస్తున్న కలెక్టర్ శ్యామ్ ప్రసాద్

జ్యూరీ మెంబర్లయిన జి.రాజు, జి.శ్రీనివాస్, కె.సూర్యారావు, ఎల్.రామకృష్ణ, ఎం.రామకష్ణలకు కలెక్టర్ దుస్సాలువ, జ్ఞాపికతో ఘనంగా సత్కరించారు.

అంతర్జాతీయ స్థాయి శాస్త్రవేత్తలుగా ఎదగాలి : ఎమ్మెల్యే

విద్యార్థులు తలచుకుంటే ఎన్నో అద్భుతాలు సృష్టించగలరని, అటువంటి వాటికి నాంది పలికి అంతర్జాతీయ శాస్త్రవేత్తలుగా ఎదగాలని స్థానిక ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర ఆకాంక్షించారు. స్థానిక డివివిఎం స్కూల్ ఆవరణలో ఏర్పాటు చేసిన జిల్లా స్థాయి విద్యా వైజ్ఞానిక శాస్త్ర ప్రదర్శనను ఎమ్మెల్యే సెల్ ఫోన్ ద్వారా జ్యోతి ప్రజ్వలన చేసి, సర్ సివిరామన్ చిత్రపటానికి పూలమాలంకరణ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ విద్యార్థుల్లో ఉండే ప్రతిభ, నైపుణ్యాలను వెలికితీసేందుకు విద్యా, వైజ్ఞానిక ప్రదర్శనలు దోహదపడతాయని, విద్యార్థులను ఇంజినీర్లుగా, వైద్యులుగా, శాస్త్రవేత్తలుగా తీర్చిదిద్దాలని ఉపాధ్యాయులను కోరారు. జిల్లాలో ఇంకా మూఢనమ్మకాలున్నాయని, వాటిని విడనాడి విజ్ఞానాన్ని నమ్ముకోవాలని ఆయన పిలుపునిచ్చారు. ఇప్పటికే దేశవ్యాప్తంగా నిర్వహించిన వివిధ పోటీల్లో పార్వతీపురం మన్యం జిల్లా పేరు మారుమోగిందని, ఇటువంటి ప్రదర్శనల ద్వారా మరింత ముందుకు వెళ్లాలని ఆయన కోరారు. అనంతరం పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన 15 మండలాలకు చెందిన 45 విద్యా, వైజ్ఞానిక ప్రదర్శనలను తిలకించి, వివరాలను విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. జిల్లా విద్యాశాఖాధికారి డా. ఎన్.తిరుపతినాయుడు మాట్లాడుతూ డిసెంబరు 31న మండల స్థాయిలో విజ్ఞాన ప్రదర్శనలు నిర్వహించి, మూడు కేటగిరీల్లో ప్రదర్శనలు ఎంపిక చేశామని, అందులోని 15 మండలాలకు చెందిన 45 ఉత్తమ ప్రదర్శనలను ఇక్కడ ఏర్పాటు చేసినట్లు వివరించారు. జిల్లాలో 26 అటల్ ల్యాబ్‌లు ఉన్నాయని, వాటి ద్వారా 40 ప్రాజెక్టులను ఎంపిక చేశామని తెలిపారు. భావితరానికి శాస్త్రవేత్తలను అందించేందుకు ఇటువంటి సైన్స్ ఫెయిర్లు దోహదపడతాయని, విద్యార్థుల్లోని ప్రతిభను వెలికితీసే బాధ్యత ఉపాధ్యాయులదేనని ఆయన గుర్తుచేశారు. కార్యక్రమంలో సమగ్ర శిక్ష ఎపిసి ఆర్.తేజేశ్వరరావు, డిప్యూటీ డిఇఒలు డి.రాజ్‌కుమార్, పి.కృష్ణమూర్తి, డిసిసిబి కార్యదర్శి పిసి శ్రీనివాసరావు, విద్యాశాఖ ఎడి ఎం.రమాజ్యోతి, పి.దామోదరరావు, స్థానిక కౌన్సిలర్ వెంకటినాయుడు, డివివిఎం పాఠశాల హెచ్‌ఎం గోవిందరావు, ఇతర పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

సర్ సివి రామన్ చిత్రపటానికి పూలమాల వేస్తున్న ఎమ్మెల్యే విజయచంద్ర ; విద్యార్థులు ప్రదర్శించిన నమూనాలను పరిశీలిస్తున్న కలెక్టర్

విశాఖ డెయిరీని కంపెనీ చట్టం నుంచి తప్పించాలి

ప్రజాశక్తి - పార్వతీపురం

సహకార రంగంలో ఉన్న విశాఖ డెయిరీని కంపెనీ చట్టం నుంచి తప్పించాలని ఎపి రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు మర్రాపు సూర్యనారాయణ డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక కలెక్టరేట్ ఎదుట పాడి రైతులతో కలిసి నిర్వహించిన ధర్నాను ఉద్దేశించి ఆయన మాట్లాడారు. సహకార రంగంలో డెయిరీని కంపెనీ చట్టంలోకి తీసుకెళ్లి ట్రస్ట్ పేరుతో ఆస్తులను అన్యాక్రాంతం చేశారని చెప్పారు. రైతులకు రావాల్సిన పాలధరలో కొంత మొత్తాన్ని కోతపెట్టి ట్రస్ట్ పేరుతో బదలాయించారని చెప్పారు. తగ్గించిన పాల ధర పెంచాలని డిమాండ్ చేశారు. ఇతర రాష్ట్రాల్లో మాదిరిగా ఈ రాష్ట్రంలోనూ లీటర్‌కు ఐదు రూపాయల ప్రోత్సాహకం ఇవ్వాలని కోరారు. పాలధరలో కోత పెట్టి ఆ డబ్బుతో బోనస్ చెల్లించకుండా డెయిరీ లాభాల నుంచి బోనస్ చెల్లించాలని డిమాండ్ చేశారు. డెయిరీని కంపెనీ చట్టం నుంచి తప్పించాలని, అన్యాక్రాంతమైన ఆస్తులను స్వాధీనం చేసుకోవాలని డిమాండ్ చేశారు. అవినీతి, అక్రమాలపై నిష్పాక్షిక విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. ఆవుపాలకు లీటరుకు రూ.50, గేదె పాలకు లీటరుకు రూ.80గా ధర నిర్ణయించాలని కోరారు. పశువుల దాణాకు 75 శాతం రాయితీ ఇవ్వాలని డిమాండ్ చేశారు. అనంతరం జిల్లా రెవెన్యూ అధికారి కె.హేమలతకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఎపి రైతు సంఘం జిల్లా అధ్యక్షులు ఎం.కృష్ణమూర్తి, ఉపాధ్యక్షులు బంటు దాసు, సర్పంచ్ కరణం రవీంద్ర పాల్గొన్నారు.

కలెక్టరేట్ వద్ద ధర్నానుద్దేశించి మాట్లాడుతున్న రైతు సంఘం నాయకులు మర్రాపు సూర్యనారాయణ

సాలూరురూరల్ : పెరిగిన ధరలకు అనుగుణంగా పాల సేకరణకు మద్దతు ధర ఇవ్వాలని సిఐటియు జిల్లా కార్యదర్శి ఎన్‌వై నాయుడు డిమాండ్ చేశారు. పాలకు మద్దతు కోరుతూ శుక్రవారం స్థానిక విశాఖ డెయిరీ వద్ద పాడి రైతులతో కలిసిన నిరసన తెలిపారు. వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయనతో పాటు పాలరైతు సంఘం నాయకులు ఏగిరెడ్డి రాము మాట్లాడుతూ విశాఖ డెయిరీ పరిధిలోని పాల రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. నిత్యవసర వస్తువుల ధరలు పెరిగిపోతున్న ప్రస్తుత రోజుల్లో పాల రైతుల పొట్ట కొట్టేలా విశాఖ డెయిరీ లీటరు ఆవు పాలు ధరను మూడు నుంచి నాలుగు రూపాయల వరకు తగ్గించిందని, ఇదే సమయంలో దాణా ధర బస్తాకు రూ.750 నుంచి 1000 రూపాయలకు పెంచిందని అన్నారు. ఈ చర్యలు పాడి రైతులను దివాళా తీసేలా చేయడం కాదా అని ప్రశ్నించారు. తగ్గించిన పాలధరను పెంచాలని, సంక్రాంతి నాటికి బోనస్ ఇవ్వాలని, పాల సేకరణ అమ్మకం ధర వ్యత్యాసంలో 10 శాతం రైతులకు ఇవ్వాలని, రూ.250 కోట్ల షేర్ క్యాపిటల్‌కు డివిడెండ్ ఇవ్వాలని, సహకార చట్టం ద్వారా ఎన్నికలను నిర్వహించాలని, డెయిరీని కంపెనీ చట్టం నుండి తప్పించి 1964 సహకార చట్టం ద్వారా నడపాలని, దాణా బస్తా 50శాతం రాయితీ ధరకు ఇవ్వాలని, పాడి పశువుల బీమా సీలింగ్ ఎత్తివేయాలని, విశాఖ డెయిరీపై వేసిన సభా సంఘం విచారణ త్వరగా పూర్తిచేసి, దోషులను కఠినంగా శిక్షించి, విశాఖ డెయిరీని కాపాడాలని కోరారు. కార్యక్రమంలో పాల రైతులు బొద్దల మహేష్, శ్రీను, రాంబాబు, తాతాజీ పాల్గొన్నారు.

క్షేత్ర స్థాయిలో రెవెన్యూ సమస్యలు తగ్గాలి

ప్రజాశక్తి - పార్వతీపురం

రెవెన్యూ సదస్సులు అనంతరం క్షేత్ర స్థాయిలో రెవెన్యూ సమస్యలు తగ్గాలని జిల్లా కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ అన్నారు. రెవెన్యూ సమస్యల పరిష్కారంపై సమగ్ర నివేదిక సమర్పించాలని ఆయన ఆదేశించారు. రెవెన్యూ సదస్సులు, పల్లెనిద్ర, ప్రజా సమస్యల పరిష్కార వేదిక తదితర అంశాలపై కలెక్టర్ శుక్రవారం వీడియో కాన్ఫరెన్స్‌లో సమీక్షించారు. రెవెన్యూ సదస్సుల నియోజకవర్గ ప్రత్యేక అధికారులు రెవిన్యూ సదస్సుల్లో అందిన వినతుల పరిష్కారం స్థితిని పరిశీలిస్తారని అన్నారు. ప్రధాన మంత్రి ఆవాస్ యోజన 2.0లో భాగంగా గృహ అవసరాలు ఉన్నవారిని గుర్తించాలని మున్సిపల్ కమిషనర్‌ను ఆదేశించారు. జిల్లాలో ఐదు వేల గృహాలు ఫిబ్రవరి మాసాంతానికి పూర్తి చేయాలని, దీనికి ఎంపిడిఒ దృష్టి సారించాలని స్పష్టం చేశారు. పిఎం జన్‌మాన్ పనులపై గిరిజన ప్రాంతాల్లో శ్రద్ధ వహించాలని ఆదేశించారు. ఎస్‌సి కుల ఆడిట్‌లో భాగంగా ఈనెల 7 వరకు అభ్యంతరాలు స్వీకరణ జరుగుతుందని చెప్పారు. రక్తహీనత నివారణపై దృష్టి సారించాల్సిన అవసరం ఉందన్నారు. పల్లెనిద్ర, గ్రామదర్శిని కార్యక్రమంలో సమస్యలు గుర్తించి వాటి పరిష్కారానికి పర్యవేక్షణ చేయాలని ఆయన ఆదేశించారు.

డిఎంహెచ్ఒ భాస్కరరావు బాధ్యతల స్వీకరణ

ప్రజాశక్తి - పార్వతీపురంరూరల్

జిల్లా వైద్యారోగ్య శాఖాధికారిగా డాక్టర్ ఎస్.భాస్కరరావు శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఇంత వరకు ఈయన విజయనగరం డిఎంహెచ్‌ఒగా పనిచేశారు. జిల్లా ఆరోగ్య శాఖ అధికారులు, వైద్యులు, సిబ్బంది ఆయనకు ఆరోగ్య కార్యాలయంలో పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. సీతంపేట డిప్యూటీ డిఎంహెచ్ఒ డాక్టర్ కె. విజయపార్వతి ఇంతవరకు డిఎంహెచ్‌ఒగా విధులు నిర్వహించారు. అందరూ సమన్వయంతో పనిచేస్తూ వైద్య సేవలు అందజేయాలని, జిల్లాకు మంచి గుర్తింపు తీసుకు వచ్చేలా కృషి చేయాలని డిఎంహెచ్ఒ సూచించారు. అనంతరం జిల్లా కలెక్టర్ ఎ.శ్యాంప్రసాద్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. కార్యక్రమంలో డిఐఒ డాక్టర్ నారాయణరావు, డిప్యూటీ డిఎంహెచ్ఒ డాక్టర్ పద్మావతి, ప్రోగ్రాం అధికారులు డా.జగన్మోహన్, డా.రఘు, డా.వినోద్, డా.విజయమోహన్, డా.శ్రీధర్, ఆఫీసు సూపరింటెండెంట్ కామేశ్వరరావు, ఎన్జీఒ ప్రెసిడెంట్ కిషోర్, ఆరోగ్య కార్యాలయ సిబ్బంది తదితరులు ఉన్నారు.

సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత : ఎస్‌పి

ప్రజాశక్తి -పార్వతీపురంరూరల్

పోలీసు సిబ్బంది సమస్యల పట్ల సానుకూలంగా స్పందించి, పరిష్కారానికి చర్యలు చేపడతానని ఎస్‌పి ఎస్‌వి మాధవ్ రెడ్డి అన్నారు. పోలీస్ సిబ్బంది శాఖాపరమైన సమస్యల పరిష్కారానికి స్థానిక పోలీస్ ప్రధాన కార్యాలయంలో "పోలీస్ వెల్ఫేర్ డే" (గ్రీవెన్స్ డే) శుక్రవారం నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లాలోని పోలీస్ సిబ్బంది పాల్గొని వారి సమస్యలను ఎస్పీకి విన్నవించుకున్నారు. సిబ్బంది సమస్యలను ఎస్పీ విని, విన్నపాలను పరిశీలించి సత్వర పరిష్కారానికి అవకాశం ఉన్న సమస్యలను వెంటనే పరిష్కరించారు. మిగిలిన సమస్యలకు త్వరలోనే పరిష్కారం చూపుతామని పోలీస్ సిబ్బందికి భరోసా కల్పించారు. జిల్లా పోలీస్ కార్యాలయ సంబధిత ఫిర్యాదులపై అధికారులతో ఎస్పీ మాట్లాడి, పరిష్కారానికి ఉన్న అవకాశం చూసి త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు. కార్యక్రమంలో సిసి సంతోష్ కుమార్ పాల్గొన్నారు.

ప్రశాంతంగా పీసా ఎన్నికలు

ప్రజాశక్తి - కురుపాం

మండలంలోని పెద్దగొత్తిలి సచివాలయంలో శుక్రవారం సర్పంచ్ టి.లోకనాథం అధ్యక్షతన ఎన్నికల అధికారి వి.అఖిలనాయుడు ఆధ్వర్యంలో పీసా ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయి. పీసా ఉపాధ్యక్షులుగా మూటక వేణు, కార్యదర్శిగా తిమ్మక విద్యాసాగర్, సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నిరంతరం గిరిజనులకు అందుబాటులో ఉండి వారి హక్కుల సాధన కోసం పాటుపడతామని అన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి బి.చంటి, సచివాలయం విద్య సహాయకులు విజయమనోహర్ పాల్గొన్నారు.

ప్రచార కరపత్రాన్ని విడుదల చేస్తున్న ఎమ్మెల్సీ అభ్యర్థి విజయగౌరి, యుటిఎఫ్ నాయకులు, ఉపాధ్యాయులు

పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి విజయగౌరిని గెలిపించండి

ప్రజాశక్తి -సాలూరు

మార్చిలో జరగబోయే ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఉపాధ్యాయ, విద్యారంగ అభివృద్ధి కోసం కృషి చేసిన పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి కె.విజయగౌరిని గెలిపించాలని కోరుతూ యుటిఎఫ్ ఆధ్వర్యాన నాయకులు, ఉపాధ్యాయులు సాలూరు, పాచి పెంట మండలాల్లో పాఠశాలలను సందర్శించారు. ప్రజా వ్యతిరేక సంస్కరణలు, విధానాలను ఎదురించి అనేక పోరాటలకు నాయకత్వం వహించిన విజయంగౌరికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాల్సిందిగా కోరారు. ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి భవిష్యత్తులో చట్టసభల్లో గళమెత్తే నేతను ఎన్నుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ అభ్యర్థి విజయగౌరి, యుటిఎఫ్ జిల్లా కార్యదర్శులు జానకీరావు, రామకృష్ణలు పాల్గొన్నారు.

నీతి అయోగ్ అభివృద్ధి పనులు వేగవంతం

ప్రజాశక్తి - పార్వతీపురం

నీతి అయోగ్ సంయుక్త కార్యదర్శి కెఎస్ రాజీమన్ శుక్రవారం స్థానిక కలెక్టరేట్‌కు విచ్చేశారు. కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ మర్యాద పూర్వకంగా పుష్పగుచ్ఛాన్ని అందజేసి, శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా నీతి ఆయోగ్ ఆశావహ జిల్లాగా జిల్లాలో చేపడుతున్న అభివృద్ధి పనులు, ప్రణాళికపై వివరంగా సంయుక్త కార్యదర్శితో చర్చించారు. ఆశావహ జిల్లాలో భాగంగా ఏర్పాటు చేయనున్న స్కిల్‌హబ్ సెంటర్, గ్రామ విజ్ఞాన కేంద్రాల వివరాలను తెలిపారు. జిల్లా అభివృద్ధికి ప్రణాళికాబద్ధంగా కృషి చేస్తున్న విధానానికి సంతృప్తి వ్యక్తం చేశారు. పనులు వేగవంతం చేయాలని సూచించారు.

కలెక్టర్‌ను కలిసిన నీతిఅయోగ్ కార్యదర్శి రాజీమన్

విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ

వీరఘట్టం : మండలంలోని విక్రంపురం ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం ఎంఇఒ ఆర్.ఆనందరావు విద్యార్థులకు పుస్తకాల పంపిణీ చేశారు. ఇదే గ్రామానికి చెందిన అలజంగి జగదీశ్వరరావు విద్యార్థులకు పలకలు, నోటు పుస్తకాలు, పెన్సిల్ అందజేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు ఎం.కవిత, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

ఇంజినీరింగ్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

ఎపి మున్సిపల్ వర్కర్స్, ఎంప్లాయీస్ యూనియన్ డిమాండ్

ప్రజాశక్తి - సాలూరు

మున్సిపల్ మేనేజర్‌కు వినతిని అందజేస్తున్న ఇంజినీరింగ్ కార్మికులు

మున్సిపాల్టీ లో పనిచేస్తున్న ఇంజినీరింగ్ విభాగం కార్మికుల జీతాల సమస్యను వెంటనే పరిష్కరించాలని ఎపి మున్సిపల్ వర్కర్స్, ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా కార్యదర్శి ఎన్ వై నాయుడు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద ధర్నా చేశారు. ఈ ధర్నానుద్దేశించి నాయుడు మాట్లాడుతూ జీవో 36 ప్రకారం ఇంజినీరింగ్ కార్మికులకు వేతనాలు పెంచేందుకు వేసిన కమిటీ ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల నీరుగారు తోందని, దీంతో కార్మికులు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. గత సమ్మె కాలంలో వేతనకమిటీ వేసినా అది ముందుకు వెళ్లని పరిస్థితి ఉందని, పెరిగిన ధరలకు తగ్గట్టుగా ఇంజినీరింగ్ కార్మికుల వేతనాలు వెంటనే పెంచాలని డిమాండ్ చేశారు. సమ్మె సమయంలో రిటైర్ అయిన కార్మికులకు పదేళ్ల సర్వీస్ ప్రాతిపదికన రూ.75000, అదనంగా ప్రతి ఏటా రూ.2వేలుతో కలిపి రిటైర్మెంట్ బెనిఫిట్‌గా ఇస్తామని ప్రకటించినా ఆ జిఒ ఇవ్వలేదన్నారు. అలాగే దహన సంస్కారాలకు రూ.20వేలకు పెంచుతూ మినిట్స్ ఉన్న జీవో లేదని, ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందిస్తామని దీనికి జీవో ఇస్తామన్నారని, బీమా సౌకర్యం ప్రతి కార్మికునికి ఐదు లక్షలు చేస్తూ జీవో ఇస్తామన్నారని, ఈ నిర్ణయాలన్నీ ప్రభుత్వం జీవో రూపంలో ఇవ్వాల్సి ఉన్నా నేటికీ ఇవ్వకుండా కాలయాపన చేస్తుందని, అందుకే ఇప్పటికైనా ఆలోచించి వెంటనే ఇంజినీరింగ్ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. అనంతరం సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని మున్సిపల్ మేనేజర్‌కు అందించారు. కార్యక్రమంలో వాటర్ వర్కర్స్ యూనియన్ నాయకులు డి.సంతోష్ కుమార్, ఎలక్ట్రికల్ వర్కర్స్ యూనియన్ నాయకులు అమర్‌కుమార్, ఇంజినీరింగ్ సెక్షన్ నాయకులు పి.పోలా రావు, ఎంసూర్య నారాయణ, ఎన్.అశోక్, పి.ఉమా, ఎం.దుర్గాప్రసాద్, ఎ.రఘురాం, కె.శివశంకర్ తదితరులు పాల్గొన్నారు.

వృథాగా పోతున్న సాగునీరు

కూలిన గుమ్మిడిగెడ్డ ఆయకట్టు

ప్రజాశక్తి - కురుపాం

తలుపు పాడైపోవడంతో వృథాగా పోతున్న నీరు

కురుపాం సమీపానున్న గుమ్మిడిగెడ్డ ఆయకట్టు తలుపు నేలకూలిపోవడంతో సాగు నీరు వృథాగా గెడ్డలోకి వెళ్లిపోతుందని గుమ్మడిగెడ్డ ఆయకట్టు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సాగునీరు వృథాగా పోతున్నా ఇరిగేషన్ అధికారులు స్పందించకపోవడం దారుణమని, రెండో వరి పంట సాగుకు సిద్ధమౌతున్న సమయంలో నీరు వృథాగా పోతుందని అన్నారు. దీంతో ఆయకట్టు దిగువనున్న సుమారు 1500 ఎకరాల సాగునీరు ప్రశ్నార్థకంగా మారుతుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నా రు. అధికారులు స్పందించి తలుపు మరమ్మతులు చేపట్టి సాగునీరందించాలని కోరుతున్నారు.

9న బడ్జెట్ సమావేశం

వీరఘట్టం : స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఈనెల 9న బడ్జెట్ సమావేశం జరుగుతుందని ఎంపిడిఒ బి.వెంకటరమణ. శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపిపి డి.వెంకటరమణ నాయుడు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశం ఉదయం 10 గంటలకు నిర్వహించినట్లు తెలిపారు. మండల స్థాయి అధికారులు సమయం పాటించి విధిగా హాజరు కావాలని ఆయన కోరారు.

రాజ్యాంగ పరిరక్షణ కరపత్రాలను ఆవిష్కరిస్తున్న సిపిఎం, ప్రజాసంఘాల నాయకులు

'రాజ్యాంగాన్ని కాపాడుకుందాం'

ప్రజాశక్తి - పాచిపెంట

దేశ సమైక్యత, మతసామరస్యం, స్వేచ్ఛ, సమానత్వం, ప్రజాస్వామ్యం ప్రగతి బాటలో ముందుకు అడిగేద్దామని, భారత రాజ్యాంగాన్ని కాపాడుదామని సిపిఎం నాయకులు రెడ్డి వేణు అన్నారు. ఈ మేరకు మండలంలోని బడ్నాయకవలస వద్ద రాజ్యాంగ పరిరక్షణకు సంబంధించిన కరపత్రాన్ని గురువారం విడుదల చేశారు. ఈ సందర్భంగా రెడ్డి వేణు మాట్లాడుతూ స్వేచ్ఛ, సామరస్యం, సమానత్వం నెలకొల్పినప్పుడే ఏ దేశమైన అభివృద్ధి చెందుతుంద న్నారు. బిజెపి అధికారంలోకి వచ్చిన తర్వాత రైతాంగానికి, మహిళలకు, విద్యార్థులకు ఎవరికీ ఎటువంటి రక్షణ లేదని ఆవేదన వ్యక్తం చేశారు. జాతీయ ఉద్యమ స్ఫూర్తితో పోరాడి సాధించుకున్న ప్రభుత్వరంగ సంస్థలను కార్పొరేట్లకు అప్పజెప్పి దేశ సంపదను లూటీ చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మూసిన పరిశ్రమలను తెరిపించకుండా ఉపాధి లేకుండా నిరుద్యోగాన్ని పెంచి పోషిస్తున్నారని విమర్శించారు. రాష్ట్ర విభజన అనంతరం దశాబ్ద కాలంగా మన రాష్ట్రానికి కేంద్రం అన్యాయం చేస్తూనే ఉందని, దానికి వ్యతిరేకంగా పోరాడుతున్న ప్రజలందరినీ చీల్చి మతం పేరుతో కులం పేరుతో కుతంత్రాలు చేస్తున్నారని అన్నారు. మనమంతా భారతీయులైన అంటూ మత స్వేచ్ఛను గౌరవిద్దాం అంటూ భారత రాజ్యాంగాన్ని కాపాడుకుంటామంటూ సిపిఎం, ప్రజాసంఘాలు చేస్తున్న పోరాటాల్లో ప్రజలంతా భాగస్వాములు కావాలని, భవిష్యత్తులో దేశ సంపదను, దేశ సార్వభౌమాధికారాన్ని కాపాడుకోవాలని ప్రజలకు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఆదివాసీ గిరిజన సంఘం నాయకులు పడాల తమ్మయ్య, గిరిజన సంఘం మండల అధ్యక్షులు గిన్నెల బాబురావు, తామర చిన్నారావు, సిపిఎం నాయకులు కోరాడ ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి
www.prajasakti.com

విద్యార్థులను ప్రశ్నలడుగుతున్న కలెక్టర్ శ్యామ్ ప్రసాద్

స్కూల్ ఆఫ్ ఎక్స్‌లెన్స్‌ని సందర్శించిన కలెక్టర్

ప్రజాశక్తి - సీతానగరం

మండలంలోని జోగింపేట స్కూల్ ఆఫ్ ఎక్సలెన్స్ గిరిజన పాఠశాలను కలెక్టర్ ఎ.శ్యాం ప్రసాద్ గురువారం రాత్రి సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాలలో చదువుతున్న విద్యార్థులను ప్రశ్నలు అడిగి తెలుసుకున్నారు. ప్రతి గురువారం జరిగే పల్లెనిద్రలో భాగంగా సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థుల నుంచి వివిధ అంశాలపై ప్రశ్నలు అడిగి సమాధానాలను రాబట్టారు. కార్యక్రమంలో మండల అధికారులు పాల్గొన్నారు.

పరిశ్రమల స్థాపనపై యువతకు అవగాహన

ప్రజాశక్తి - పార్వతీపురం రూరల్

రాష్ట్ర చిన్న పరిశ్రమల అభివృద్ధి సంస్థ (ఎపిఎస్ఎస్‌డిసి) ఆధ్వర్యంలో మండలంలోని డోకిశిల గ్రామ సచివాలయంలో ఔత్సాహిక పారిశ్రామికవేత్తల అవగాహన సదస్సు శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన జిల్లా పరిశ్రమల అధికారి కరుణాకర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం సంకల్పం పథకం ద్వారా యువ పారిశ్రామికవేత్తలను, కుటీర పరిశ్రమల ఏర్పాటుకు ప్రోత్సహిస్తుందన్నారు. వీటిపై యువత అవగాహన కల్పించుకొని చిన్న, చిన్న పరిశ్రమల స్థాపన ద్వారా ఆర్థికంగా ఎదగాలని కోరారు. కార్యక్రమంలో పరిసర గ్రామాల నుంచి 30 మంది యువతీ యువకులు, జిల్లా నైపుణ్యాభివృద్ధి శాఖ అధికారి కె.సాయికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పిఒకు న్యూట్రిషన్ కిట్‌ను అందజేస్తున్న వైద్యాధికారులు

పిఒకు న్యూట్రిషన్ కిట్ అందజేత

ప్రజాశక్తి - సీతంపేట

స్థానిక ఐటిడిఎ పిఒ సి.యశ్వంత్ కుమార్‌రెడ్డికి డిప్యూటీ డిఎంహెచ్ఒ కె.విజయపార్వతి మర్రిపాడు, ధోనుభాయి, కుసిమి వైద్య అధికారులు సాయిచరణ్, భాను ప్రతాప్, చాందిని, ఇతర వైద్యాధికారులు పౌష్టికాహారం కిట్లను అందజేసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ న్యూట్రిషన్ కిట్టిలో ఏజెన్సీలో రక్తహీనత గిరిజనులు ఉన్నందున ఈ న్యూట్రిషన్ ఫుడ్ తీసుకుంటే రక్తహీనతను అధిగమించవచ్చని, ఈ కిట్టు ద్వారా అభిప్రాయం వ్యక్తం చేశారు.

డిజిటల్ సహాయకుల సంఘ అధ్యక్షులుగా సాగర్

ప్రజాశక్తి - వీరఘట్టం

స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గురువారం. డిజిటల్ సహాయక సంఘ అధ్యక్షులు ఎన్నిక ఎంపిడిఒ బి.వెంకటరమణ ఆధ్వర్యంలో జరిగింది. అధ్యక్షులుగా పి.విద్యాసాగర్, ఉపాధ్యక్షులుగా ఎం.స్వాతి, కార్యదర్శిగా వి.స్వాతి, సహాయ కార్యదర్శిగా కె.సురేష్, కోశాధికారిగా బి.అశోక్‌వర్ధన్, సమన్వయకర్తగా పి.సింహాచలను ఎన్నుకున్నారు. ఎన్నికైన కమిటీకి ఎంపిడిఒ ధ్రువపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఆయా సచివాలయం డిజిటల్ సహాయకులు పాల్గొన్నారు.

వాహనచోదకులకు అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ అమ్మన్నరావు

వాహన చోదకులకు హెల్మెట్ తప్పనిసరి

ప్రజాశక్తి - సీతంపేట

వాహన చోదకులు హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని స్థానిక ఎస్ఐ వై.అమ్మనరావు అన్నారు. శుక్రవారం దోనుబాయి కూడలి వద్ద రోడ్డు భద్రత ప్రమాదాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాహనాలు బయటికి తీస్తే తప్పనిసరిగా హెల్మెట్ ఉండాలన్నారు. ట్రాఫిక్ నిబంధనలు పాటించాలన్నారు. లైసెన్స్, సి-బుక్, ఇన్సూరెన్స్ తప్పనిసరిగా ఉండాలన్నారు. మైనర్లకు వాహనాలు ఇవ్వరాదని చెప్పారు. త్రిపుల్ రైడింగ్ చేయరాదన్నారు. మితిమీరి వేగంతో వెళ్లరాదని అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎఎస్ఐ సంజీవ్, హెచ్‌సి గురుమూర్తి తదితరులు పాల్గొన్నారు.

షెడ్‌నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న హెచ్‌ఎం హేమలత

హైస్కూల్‌కు సైకిల్ షెడ్ వితరణ

ప్రజాశక్తి - మక్కువ

స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థుల సౌకర్యార్థం సైకిల్ షెడ్డును టిడిపి సీనియర్ నాయకులు మావుడి ప్రసాదరావునాయుడు వితరణ చేశారు. ఈమేరకు శుక్రవారం ఆయన పుట్టినరోజు సందర్భంగా ప్రసాద్ నాయుడు సైకిల్ షెడ్ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమానికి స్థానిక హెచ్‌ఎం హేమలత భూమి పూజచేశారు. ఈ మేరకు ప్రసాద్ నాయుడుకు పాఠశాల సిబ్బంది, స్కూల్ కమిటీ చైర్మన్ కోన ఈశ్వరరావు, కృజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది, టిడిపి కార్యకర్తలు పాల్గొన్నారు.

జోరుగా పత్తి కొనుగోలు

ప్రజాశక్తి -భామిని

స్థానిక ఎఎంసి యార్డ్‌లో సిసిఐ ప్రభుత్వం పత్తి కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేసింది. ప్రస్తుతం ఈ కొనుగోలు కేంద్రంలో జోరుగా పత్తి కొనుగోలు సాగుతుంది. ప్రస్తుతం పత్తి కొనుగోలు కేంద్రంలో పత్తికి మద్దతు ధర అందడంతో పత్తి రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

కొనుగోలు కేంద్రానికి పత్తితో వచ్చిన వాహనాలు

స్త్రీ వాద సంఘ సంస్కర్త సావిత్రిబాయి పూలే

ప్రజాశక్తి -పార్వతీపురం టౌన్

భారతదేశ మొదటి తరం స్త్రీవాద సంఘ సంస్కర్త సావిత్రిబాయి పూలే అని సిపిఎం పట్టణ నాయకులు అన్నారు. సావిత్రి బాయిపూలే 193 వ జయంతిని పురస్కరించుకొని శుక్రవారం స్థానిక టిఆర్ఎస్ఎంఎం బాలికల ఉన్నత పాఠశాలలో ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయులు డి.శోభారాణి, ఉపాధ్యాయులు ఇ.జ్యోతిలక్ష్మి, కె.భారతి, వి.వెంకటలక్ష్మితో కలిసి సాయితిబాయి పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లు అర్పించారు. ఈ సందర్భంగా సిపిఎం నాయకులు

సావిత్రిబాయి పూలే చిత్రపటానికి పూలమాల వేస్తున్న సిపిఎం నాయకులు

మాట్లాడుతూ వి. ఇందిర, గొర్లె వెంకటరమణ మాట్లాడుతూ పూలే దంపతులు లేని భారత దేశ చరిత్రను మనం ఊహించలేమన్నారు. దేశ సాంఘిక సంస్కరణోద్యమంలో వారి పాత్ర ఒక అద్భుతమన్నారు. భారత సామాజిక నూతన ఒరవడికి మార్గం సుగమం చేయడంలో వీరి పాత్రకు ఒక ప్రత్యేకత ఉంది. ఈ ఉద్యమ గమనంలో ఎన్ని ఆటు పోట్లు వచ్చిన వాటిని తట్టుకుని నిలబడి ఎదురొడ్డటం నేటి తరానికి కూడా సాధ్యం అయ్యేపని కాదు. అంతటి ఖ్యాతిని గడించిన సావిత్రి బాయి పూలేను నేడు మనం స్మరించుకోబోతున్నామన్నారు. ఆమె భర్త జ్యోతిరావు పూలేతో కలిసి సాంఘిక సంస్కరణోద్యమంలో నూతన ఒరవడికి తెరలేపారు. సామాజిక రుగ్మతలను పారద్రోలేందుకు ఎంతో కృషి చేశారన్నారు. ఆమె జీవితం అజరామరమని, నాడు నేడు ఎన్నటికీ ఆదర్శప్రాయమేనని అన్నారు. నేడు ఇంత శాస్త్ర, సాంకేతిక పరిజ్ఞానం పెరిగినా మహిళలు, దళితుల స్థితి గతులు దుర్భరంగానే ఉన్నాయన్నారు. పూలేలను ఆదర్శంగా తీసుకుని ఈ దుర్భర పరిస్థితులను దూరం చేసే ప్రయత్నం చేయాల్సిన బాధ్యత ప్రతిఒక్కరిపైనా ఉందని, అదే మనం వారిచ్చే నిజమైన నివాళి అని అన్నారు. కార్యక్రమంలో పట్టణ పౌరసంక్షేమ సంఘం కార్యదర్శి పి.సన్యాసిరావు, జి.తులసి, రాము తదితరులు పాల్గొన్నారు.

భామిని : సావిత్రిబాయి పూలే జయంతిని పురష్కరించుకొని స్థానిక బాలుర గిరిజన ఆశ్రమ పాఠశాల ప్రధానోపాధ్యాయులు నాగభూషణం ఆమె చిత్ర

కురుపాంలో సాయిత్రిబాయి పూలేకు నివాళ్లు అర్పిస్తున్న ఉపాధ్యాయులు

పటానికి పూలమాలలు వేసి నివాళ్లు అర్పించారు. కార్యక్రమంలోని సీనియర్ ఉపాధ్యాయులు రవి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కురుపాం : స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు తోట శంకరరావు ఆధ్వర్యంలో సావిత్రిబాయి పూలే జయంతోత్సవాలునిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని సీనియర్ ఉపాధ్యాయులు ఆరంగి రామకృష్ణ జ్యోతి ప్రజ్వలన చేశారు. అనంతరం పాఠశాలలో గల మహిళా ఉపాధ్యాయులకు జ్ఞాపికలు అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఆకుల జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

వీరఘట్టం: మండలంలోని సావిత్రిబాయి పూలే వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సావిత్రిబాయి పూలే చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

భూ సమస్యల పరిష్కారానికి రెవెన్యూ సదస్సులు

ప్రజాశక్తి - పార్వతీపురం రూరల్

ప్రభుత్వం నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సుల ద్వారా గ్రామాల్లో ప్రజలు తమ భూ సమస్యల పరిష్కారం జరుగుతుందని స్థానిక తహశీల్దార్ జయలక్ష్మి తెలిపారు. మండలంలోని వెంకంపేటలో శుక్రవారం నిర్వహించిన సదస్సులో గ్రామ పరిధిలోని రెవెన్యూ సమస్యలపై దరఖాస్తులను స్వీకరించారు. ఈ సందర్భంగా గ్రామస్తుల నుంచి విశేష స్పందన లభించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆర్ ఐ రామచంద్రరావు పాల్గొన్నారు.

పాచిపెంట: మండలంలోని పద్మాపురంలో రెవెన్యూ సదస్సు జరిగింది. ఈ సందర్భంగా రైతు సంఘం మండల కార్యదర్శి బోను గౌరునాయుడు ఆధ్వర్యంలో రైతులు తమ సమస్యలపై వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా బోను గౌరునాయుడు మాట్లాడుతూ కొంతకాలం నుంచి సాగు చేస్తున్న పద్మాపురం భూములకు నేటికీ ఇనాం భూములు పేరుతో కాలయాపన చేస్తూ పట్టాలు మంజూరు చేయకపోవడం అన్యాయం చేయడమేనని ఆవేదన వ్యక్తం చేశారు. నేటికీ పట్టాలు లేకపోవడంతో పంట రుణాలు ఎటువంటి ప్రభుత్వ పథకాలు వర్తించడం లేదని అన్నారు. అలాగే పెద్దగెడ్డ ఎడమ కాలువ ద్వారా లిఫ్టు ద్వారా

పాచిపెంట : సదస్సులో తహశీల్దార్‌కు ఫిర్యాదు చేస్తున్న రైతు సంఘం నాయకులు

సాగునీరందిస్తే ఐదు పంచాయతీలకు చెందిన 10వేల ఎకరాలకు సాగునీరందుతుందన్నారు. వినతిని అందజేసిన వారిలో ఐద్వా నాయకులు బి.ఎర్రమ్మ, గిరిజన సంఘం నాయకులు టి.చిన్నారావు సిఐటియు నాయకులు కోరాడ ఈశ్వరరావు పాల్గొన్నారు. ఈ రెవెన్యూ సదస్సులను తహశీల్దార్ డి.రవి ఆధ్వర్యాన జరగ్గా ఎంపిపి బి.ప్రమీల, పాచిపెంట వీరమనాయుడు, డోల బాబ్జీ, పలువురు రైతులు పాల్గొన్నారు.

హాస్పటల్‌లో రికార్డులను పరిశీలిస్తున్న వైద్య, ఆరోగ్యశాఖ ప్రోగ్రాం అధికారి జగన్మోహనరావు

ప్రయివేట్ ఆస్పత్రుల పరిశీలన

ప్రజాశక్తి - పార్వతీపురంరూరల్

ప్రయివేటు ఆసుపత్రుల రిజిస్ట్రేషన్ ప్రక్రియలో భాగంగా పట్టణంలో కొత్తగా ప్రారంభించిన కుటుంబ్ ఐవిఎఫ్, ఫెర్టిలిటీ క్లినిక్‌ను వైద్య, ఆరోగ్యశాఖ జిల్లా ప్రోగ్రాం అధికారి డాక్టర్ టి.జగన్ మోహనరావు శుక్రవారం వైద్యబృందంతో కలిసి తనిఖీ చేశారు. ఆరోగ్యశాఖ నిర్దేశించిన ప్రమాణాలు, చెక్ లిస్ట్ ప్రకారం ఉండాల్సిన వైద్య పరికరాలు, మౌలిక సదుపాయాల నిర్వహణ తీరు పరిశీలించారు. ఆసుపత్రి రిజిస్ట్రేషన్ ప్రక్రియకు అవసరమైన అర్హతా పత్రాలు, సర్టిఫికెట్లు, డాక్యుమెంట్లు తనిఖీ చేశారు. క్లినిక్‌లో తనిఖీలకు అవసరమైన పరికరాల లభ్యత, రికార్డుల నిర్వహణ పరిశీలించారు. బయోమెడికల్ వ్యర్థ నిర్వహణ ఏర్పాట్లు, టాయిలెట్ల నిర్వహణ పరిశీలించారు. ఆరోగ్య అంశాలకు సంబంధించి గోడ పత్రికలను ప్రదర్శించాలని సూచించారు. రిసెప్షన్ సిబ్బందితో మాట్లాడి ఆరోగ్య పరీక్షలకు వచ్చిన వారి పూర్తి వివరాలు నమోదు చేయాలని తెలిపారు. ఆసుపత్రి ఆవరణ, పరిశుభ్రత తీరు పరిశీలించారు. కార్యక్రమంలో ఐఎంఎ జిల్లా ప్రెసిడెంట్ డాక్టర్ వై.వివేక్, జిల్లా ఆరోగ్య కార్యాలయ డిప్యూటీ డెమోలు వై.యోగీశ్వర రెడ్డి, వి.సన్యాసిరావు, ఇఒ సత్తిబాబు తదితరులు ఉన్నారు.

సీతంపేటలో జూనియర్ కాలేజీ ఏర్పాటు చేయాలి : ఎస్ఎఫ్ఐ

ప్రజాశక్తి - సీతంపేట

మండలంలో ప్రభుత్వ జూనియర్ కాలేజీ ఏర్పాటు చేయాలని ఎస్ఎఫ్ఐ టి.అఖిల్ డిమాండ్ చేశారు. ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో మండల మహా సభలు శుక్రవారం జరిగాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యారంగంలో ఉన్న సమస్యలు పరిష్కరించాలని, ముఖ్యంగా హనర్స్ డిగ్రీ మేజర్, మైనర్ విధానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. సీతంపేటలో హాస్టల్ ఉన్నప్పటికీ మెరుగైన సౌకర్యాలు ఏర్పాటు చేయాలని, ఉన్నత అధికారులు స్కూల్ కాలేజీలను పరిశీలించాలని, లేని పక్షంలో భవిష్యత్తులో పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని అన్నారు. అలాగే ఈ మహాసభలు భవిష్యత్తు కర్తవ్యాలకు వేదికగా ఉపయోగించుకోవాలని, అలాగే విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని కోరారు. అలాగే విద్యార్థులు ఎక్కువగా మత్తు పదార్థాలకు బానిసవుతున్నారని, దీనివల్ల విద్యార్థుల కుటుంబాలకు దూరమవుతున్నారని, దొంగతనాలకు అలవాటు పడి హత్యాచారాలు చేయడానికి కూడా వెనకాడడం లేదని, దీంతో వారి జీవితాలను కోల్పోతున్నారని అన్నారు. అనంతరం మండల కమిటీ అధ్యక్ష,

సభలో మాట్లాడుతున్న ఎస్ఎఫ్ఐ నాయకులు అఖిల్

కార్యదర్శులుగా తేజ, మంజుతో పాటు 11 మందితో మండల కమిటీ ఏర్పాటైంది. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ సభ్యులు సూర్య, దిలీప్, అఖిల, డాగ్రిన్, పృధ్వీ, విద్యార్థులు పాల్గొన్నారు.

సర్పంచ్‌ను పరామర్శించిన డైరెక్టర్

ప్రజాశక్తి - వీరఘట్టం

మండలంలోని బిటివాడ సర్పంచ్ శ్రీరామనరసింహమూర్తి అనారోగ్యానికి గురవ్వడంతో శుక్రవారం ఉమ్మడి శ్రీకాకుళం జిల్లా తూర్పు కాపు కార్పొరేషన్ డైరెక్టర్ గర్భాన సత్తిబాబు పరామర్శించారు. నరసింహమూర్తి ఆరోగ్య స్థితిగతులు అడిగి తెలుసుకున్నారు. ఈయనతో పాటు జనసేన నాయకులు ఉన్నారు.

పలుచోట్ల పల్లె సందర్శన

ప్రజాశక్తి - సీతానగరం

మండలంలోని మరిపివలస, జోగింపేట గ్రామాల్లో శుక్రవారం గ్రామ సదర్శన కార్యక్రమం నిర్వహించారు. గ్రామంలో ముందుగా పురవీధుల్లో ర్యాలీ నిర్వహించి, అనంతరం గ్రామంలో మంచినీరు ట్యాంకుల వద్ద పరిశీలించారు. కాలువల్లో ఉండే పూడికలు తొలగించారు. గ్రామంలో అర్హులైన వారికి పథకాలపై వివరాల్లో సేకరణ, ప్రజల నుంచి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో జిల్లా మార్కెటింగ్ మేనేజర్ వై.విమల, డిహెచ్ఒ కరుణాకర్, ఎంపిడిఒ పి.త్రివిక్రమరావు, ఇఒపిఆర్‌డి కెకె వర్మ, ఎంఇఒ జి.సూర్య దేముడు, వెంకటరమణ, పంచాయతీ కార్యదర్శులు పి.మురళీకృష్ణతో పాటు సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పిచ్చికుక్క దాడిలో ముగ్గురికి గాయాలు

ప్రజాశక్తి - సీతానగరం

మండలంలోని తామరకండి, బల్ల కృష్ణాపురం, బొక్కుపేట గ్రామాలకు చెందిన వై.శ్రీనివాసరావు, జి.శ్రీనివాసరావు, తెలు మోక్షతకు పిచ్చికుక్క దాడి చేయడంతో తీవ్ర గాయాలయ్యాయి. రైతులంతా పంట పొలాల్లో వ్యవసాయ పనుల్లో నిమగ్నమై ఉండడంతో ఎక్కడి నుండో పిచ్చికుక్క వచ్చిందో తెలియదు గానీ ఆ కుక్క పొలాల్లో పనిచేస్తున్న వారిపై దాడి చేసి గాయపర్చింది. స్థానిక పిహెచ్‌సిలో వైద్యాధికారి పావని వైద్యమందించిన అనంతరం మెరుగైన వైద్యం కోసం క్షతగాత్రులను పార్వతీపురం జిల్లా కేంద్రానికి చికిత్స నిమిత్తం తరలించారు.

మన్మోహన్‌సింగ్‌కు నివాళ్లు అర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు

నిరాడంబర ప్రధాని మన్మోహన్ సింగ్

ప్రజాశక్తి - సాలూరు

మాజీ ప్రధాని డాక్టర్ మన్మోహన్ సింగ్ అత్యంత నిరాడంబర జీవితాన్ని గడిపారని కాంగ్రెస్ నియోజకవర్గ సమన్వయకర్త గేదెల రామకృష్ణ అన్నారు. శుక్రవారం స్థానిక కాంగ్రెస్ కార్యాలయంలో మన్మోహన్ సింగ్ మృతికి సంతాప సూచకంగా పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు సిగడాపు బంగారయ్య ఆధ్వర్యాన నాయకులు, కార్యకర్తలతో కలిసి నిర్వహించిన సంతాప సభలో నిమిషాల పాటు మౌనం పాటించారు. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ రిజర్వ్ బ్యాంక్ గవర్నర్‌గా, దేశ ఆర్థిక మంత్రిగా, ప్రధానిగా పని చేసిన మన్మోహన్‌సింగ్ చివరి వరకూ నైతిక విలువలకు కట్టుబడి ఉన్నారని చెప్పారు. పట్టణ అధ్యక్షులు బంగారయ్య మాట్లాడుతూ సరళీకరణ ఆర్థిక విధానాలతో దేశాన్ని ప్రగతిపథంలోకి నడిపించిన ప్రధానిగా ఆయనకు గుర్తింపు లభించిందన్నారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు ద్వారపురెడ్డి పుండరీకాక్షనాయుడు, పట్టణ నాయకులు దాసరి భాస్కరరావు, అల్లు రామినాయుడు, ఆర్.శ్రీనివాసరావు, వై.గోవింద, రీసు రాము, చిన్నారావు, ఎస్.వెంకటరావు పాల్గొన్నారు.

కార్యకర్తలు అధైర్య పడొద్దు

ప్రజాశక్తి - కురుపాం

కూటమి ప్రభుత్వం నాయకులకు, కార్యకర్తలకు, ప్రజలకు అండగా ఉంటుందని, కావున అధైర్య పడొద్దని టిడిపి రాష్ట్ర కార్యదర్శి వైరిచర్ల వీరేశ్‌చంద్ర దేవ్ అన్నారు. శుక్రవారం కురుపాం కోటలో కూటమి నాయకులు, కార్యకర్తల ఆత్మీయకలయిక ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న ప్రతి సంక్షేమ పథకం నేరుగా లబ్ధిదారులకు అందేలా చూడాల్సిన బాధ్యత నాయకులు, కార్యకర్తలదేనని అన్నారు. అంతే కాకుండా గ్రామానికి కావాల్సిన మౌలిక వసతులు, రహదారి సౌకర్యాలు కల్పించుకొనేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. అనంతరం భవిష్యత్ కార్యాచరణ, ప్రణాళికల గూర్చి నాయకులు, కార్యకర్తలకు దిశ నిర్దేశం చేశారు. కార్యక్రమంలో ఐదు మండలాల కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న వీరేష్‌చంద్రదేవ్

పౌష్టికాహారం సక్రమంగా అందించాలి

ప్రజాశక్తి - కురుపాం

అంగన్వాడీ కేంద్రాలకు వస్తున్న పిల్లలకు, గర్భిణులకు, బాలింతలకు పౌష్టికాహారాన్ని సక్రమంగా అందించాలని బిసి సంక్షేమ జిల్లా అధికారి ఎస్.కృష్ణారావు అన్నారు. పల్లెనిద్ర కార్యక్రమంలో భాగంగా స్థానిక జ్యోతిబాపూలే పాఠశాలలో గురువారం రాత్రి పల్లె నిద్ర చేసి శుక్రవారం ఉదయం గ్రామ సందర్శన చేశారు. ఈ సందర్భంగా స్థానిక అంగన్వాడీ కేంద్రాన్ని, సచివాలయాన్ని సందర్శించి పలు రికార్డులను పరిశీలించి లబ్ధిదారులకు అందిస్తున్న సేవలపై ఆరా తీశారు. సచివాలయ ఎఎన్ఎంలకు, సిబ్బందికి సికిల్ ఎనీమియా, ఇతర వ్యాధులపై ముందస్తు తీసుకోవాల్సిన జాగ్రత్త గూర్చి ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో మేజర్ పంచాయతీ ఇఒ ఎం.ధనంజయరావు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న ఎంఇఒ సూరిదేముడు

పాఠశాల అభివృద్ధిలో భాగస్వామ్యం కావాలి

సీతానగరం : పాఠశాల అభివృద్ధికి ప్రజల భాగస్వామ్యం ఉండాలని ఎంఇఒ జి.సూర్యదేవుడు అన్నారు. మండలంలోని జోగింపేట స్కూల్ ఆఫ్ ఎక్సలెన్సులో పాఠశాల కమిటీ సభ్యులకు, ప్రధాన ఉపాధ్యాయులకు శుక్రవారం శిక్షణా తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పాఠశాల ప్రగతి సాధించేందుకు ప్రజల సహకారం తీసుకోవాలన్నారు. పాఠశాల సమస్యలు, స్థితిగతులు పరిష్కార మార్గం ఉంటే అంశాలు క్షుణంగా పరిశీలించాలన్నారు. ప్రతి ఒక్కరూ ఉపాధ్యాయులతో పాటు విద్యార్థి తల్లిదండ్రులతో సమన్వయంగా ఉండాలని అన్నారు. కార్యక్రమంలో ఎంఇఒ ఎం.వెంకటరమణ, సిఆర్పిలు రమేష్, దామోదరనాయుడు, గణేష్, అనసూయ, వివిధ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

డ్రైవర్ కుటుంబానికి ఆర్థికసాయం అందజేస్తున్న తోటి డ్రైవర్లు

డ్రైవర్‌కు ఆర్థిక సహాయం

ప్రజాశక్తి -పార్వతీపురంరూరల్

ఇటీవల ప్రమాదానికి గురై మంచం పట్టిన డ్రైవర్‌కు తోటి డ్రైవర్లు ఆర్థిక సహాయం అందించి ఆదుకున్న సంఘటన మండలంలో శుక్రవారం జరిగింది. మండలంలోని కవిటిభద్రకు చెందిన సురేష్ అనే డ్రైవర్ ఇటీవల అన్నవరం క్యాబ్ బుకింగ్ కోసం తన వాహనంతో వెళ్లగా అక్కడ ఆకస్మికంగా రోడ్డు ప్రమాదానికి గురై గాయపడ్డాడు. ఈ విషయం వాట్సాప్ గ్రూపుల ద్వారా టాటా మ్యాజిక్స్ డ్రైవర్స్ సంఘం అన్ని ఊళ్లో ఉన్న డ్రైవర్లకు తెలియజేయగా, వారంతా అప్పటికప్పుడు స్పందించి తమకు తోచిన ఆర్థిక సహాయం చేయగా వచ్చిన రూ.81,116ను గ్రూప్ అడ్మిన్స్ అయిన కొయ్యలగూడెం సత్యనారాయణ ఆధ్వర్యంలో బాధిత డ్రైవర్‌ను ఆయన స్వగ్రామంలో కలిసి ఆర్థిక సహాయాన్ని అందించారు. ఆర్థికంగా ఇబ్బందుల్లో ఉన్న తన కుటుంబాన్ని, సహచరులు ఆదుకోవడం పట్ల బాధిత డ్రైవర్ కృతజ్ఞత తెలిపారు.

తాడికొండ సచివాలయంలో చోరీ

గుమ్మలక్ష్మీపురం :మండలంలోని తాడికొండ సచివాలయం వద్ద విఆర్ఒ పుష్పలత ఉంచిన హ్యాండ్ బ్యాగ్ చోరీకి గురైంది. శుక్రవారం ఆమె స్థానిక విలేకరులతో మాట్లాడుతూ.. గురువారం సచివాలయానికి ఎంపిడిఒ, తదితర అధికారులు రావడంతో సచివాలయం వద్ద హ్యాండ్ బ్యాగ్ ఉంచి గ్రామంలోకి వెళ్లానని, వచ్చి చూసేసరికి బ్యాగ్ లేదన్నారు. బ్యాగ్‌లో రూ.3వేలు నగదు, పాన్ కార్డు, డ్రైవింగ్ లైసెన్స్, బంగారు చైన్ బిళ్ల, ఏటీఎం కార్డులు ఉన్నాయన్నారు. పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయనున్నట్లు పేర్కొన్నారు.

అగ్ని ప్రమాదాల నిర్మూలనపై అవగాహన

ప్రజాశక్తి - మక్కువ

మండలంలోని అటవీ ప్రాంతంలో అగ్ని ప్రమాదాలు, గంజాయి సాగు నిర్మూలనపై అవగాహన కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. సాలూరు అటవీ రేంజ్ మక్కువ సెక్షను దుగ్గేరు బీటులో గల మూలవలసలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఫ్లయింగ్ స్క్వాడ్ పార్టీ విశాఖపట్నం సర్కిల్ ఎఫ్ఆర్ఒ కె.శ్రీనివాసరావు ముఖ్య అతథిగా పాల్గొన్నారు. మక్కువ సెక్షన్ అధికారి కేతిరెడ్డి నారాయణరావు మాట్లాడుతూ అడవుల్లో నిప్పు పెట్టరాదని అదే విధంగా గంజాయి సాగు చేయరాదని గిరిజనులకు సూచించారు. గంజాయికి బానిస కావడం వల్ల అనేకమంది జీవితాలు నాశనమవుతున్నాయని, వాటి వలన సంభవించే పర్యవసనాలను అవగాహన కార్యక్రమంలో వివరించారు ఈ కార్యక్రమంలో అటవీ శాఖ సిబ్బంది పాల్గొన్నారు

పసిపాపపై లైంగిక దాడి కేసులో

నిందితుడికి 25 ఏళ్ల జైలు

విజయనగరం కోట : జిల్లాలో సంచలనం రేపిన పసిపాపపై లైంగిక దాడి ఘటనలో నిందితుడికి 25 ఏళ్ల కఠిన కారాగారశిక్ష పడింది. నిందితుడికి శిక్ష వేస్తూ పోక్సో న్యాయస్థానం ప్రత్యేక న్యాయమూర్తి కె.నాగమణి శుక్రవారం తీర్పు చెప్పారు. ఇందుకు సంబంధించిన వివరాలను ఎస్‌పి వకుల్ జిందాల్ విలేకర్ల సమావేశంలో వెల్లడించారు. రామభద్రపురం మండలం నేరెళ్లవలస పంచాయతీ జన్నివలసలో గత ఏడాది జులై 13న ఉయ్యాల్లో ఉన్న ఆరు నెలల పసిపాపపై అదే గ్రామానికి చెందిన బోయిన ఎరుకన్నదొర (40) లైంగిక దాడికి పాల్పడ్డాడు. అప్పట్లో నిందితుడిపై పోలీసులు పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి అరెస్టు చేశారు. డిఎస్‌పి పి.శ్రీనివాసరావు, అప్పటి బొబ్బిలి రూరల్ సిఐ ఎస్.తిరుమలరావు, రామభద్రపురం ఎస్ఐ జ్ఞాన ప్రసాద్‌దర్యాప్తు పూర్తి చేసి, నిందితుడిని అరెస్టు చేసి, న్యాయస్థానంలో అభియోగ పత్రం దాఖలు చేశారు. నేరం రుజువు కావడంతో నిందితుడికి 25ఏళ్ల జైలుశిక్ష, రూ.5వేలు జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు చెప్పారు.